క్లుప్తంగా

బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించండి



బ్యానర్లు తొలగించాలని సిబ్బందిని ఆదేశిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరులో కార్పొరేషన్ అనుమతి లేకుండా ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించాలని మునిసిపల్ కమిషనర్ అరుణ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని కొంగారెడ్డిపల్లె, కలెక్టర్ బంగ్లా, గాంధీ రోడ్డు, సంతపేట తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు పనులు చేసే సమయంలో యూనిఫామ్, చేతి తొడుగులు ధరించాలన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, సహాయ కమిషనర్ రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీఓగా ధనలక్ష్మి



పూతలపట్టు: ఎంపీడీఓగా ధనలక్ష్మి తిరిగి బాధ్యతలు స్వీకరించారు. పూతలపట్టు ఎంపీడీఓగా ఉన్న ఆమె లాంగ్ లీవ్‌పై వెళ్లారు. దీంతో ఆ కార్యాలయ ఏఓ చంద్రశేఖర్‌ను ఇన్‌చార్జిగా వ్యవహరించారు. తిరిగి ఆమె రావడంతో సీఈఓ గ్లోరియా జెడ్పీ కార్యాలయంలో ఆర్డర్స్‌ను అందజేశారు. ప్రస్తుత ఎంపీడీఓ ప్రసన్న కుమారి నెల్లూరు జిల్లాకు బదిలీ అయిన విషయం తెలిసిందే.

పోలీస్ అధికారులు బాధ్యతల స్వీకరణ

చిత్తూరు అర్బన్: ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన పలువురు సీఐలు, ఎస్‌ఐలు శుక్రవారం చిత్తూరులో బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు స్పెషల్ బ్రాంచ్ సీఐగా ఎస్.భాస్కర్, టూటౌన్ సీఐగా నెట్టికంఠయ్య, తాలూక ఎస్‌ఐగా రమేష్, టూటౌన్ ఎస్‌ఐగా కె.సుగుణ ఆయా స్టేషన్లలో బాధ్యతలు స్వీకరించారు.

వేడుకగా ఉరుసు

చిత్తూరు రూరల్: నగరంలోని దర్గాలో శుక్రవారం ఉరుసును వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. ఇందులో భాగంగా ముస్లింలు వందలాదిగా తరలివచ్చారు. వారి రాకతో దర్గా కిక్కిరిసింది. రాత్రి అన్నదానం చేశారు. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఈ వేడుకల్లో పాల్గొని, దర్గాను దర్శించుకున్నారు.

18న ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం

చిత్తూరు కలెక్టరేట్: నగరంలో రాంనగర్ కాలనీలోని హార్వర్డ్ పాఠశాలలో ఈ నెల 18న ఉచిత మెగా నేత్ర శిబిరాన్ని బెంగళూరుకు చెందిన శంకరనేత్రాలయ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు కరస్పాండెంట్ భాస్కర్ తెలిపారు. నగర ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వినాయకుని సేవలో కైకలూరు ఎమ్మెల్యే

కాణిపాకం: శ్రీకాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం కై కలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఆలయ పునర్నిర్మాణ దాత గుత్తికొండ శ్రీనివాస్, సినీ నిర్మాత కేవీఎల్ నారాయణ దర్శించుకున్నారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి దర్శనార్థం విచ్చేసిన వారికి ఆలయ ఈవో వాణి స్వాగతం పలికారు. ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా స్వామివారి శేష వస్త్రాలు కప్పి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: కోల్‌కత్తాలో పీజీ డాక్టర్ దారుణ హత్యాచారం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి చిత్తూరులో విద్యార్థులతో కలిసి కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నిషిధ, చిట్టిబాబు, రామభద్ర పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేకపోతే స్కూల్ బస్సులు సీజ్

పుంగనూరు: స్కూల్ బస్సులకు అవసరమైన రికార్డులు, ఫిట్‌నెస్ లేకపోతే సీజ్ చేస్తామని ఎంవీఐ సుప్రియ హెచ్చరించారు. శుక్రవారం ఆమె స్కూల్ బస్సులను నడిపి, ఫిట్‌నెస్ పరీక్షించారు. ఆమె మాట్లాడుతూ, పట్టణంలోని స్కూల్ బస్సుల యజమానులు తక్షణమే తమ బస్సులకు ఇన్సూరెన్స్, పర్మిట్, పొల్యూషన్ కంట్రోల్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలన్నారు. రికార్డులు లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామన్నారు. అలాగే డ్రైవర్లు లైసెన్సులు కలిగి ఉండాలన్నారు.

రైతన్నా.. సాగుకు సమయమిదే!

ఆదాయాన్ని ఇచ్చే కూరగాయల సాగుకు సమయమిదేనని ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు. రైతులు అధికారుల సూచనలకు అనుగుణంగా యాజమాన్య పద్ధతులు, మెళకువలు పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందించవచ్చు. విత్తనాల కొనుగోలు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయ శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. జూలై నుంచి సెప్టెంబర్ వరకు కూరగాయలు, పందిరి కూరగాయలైన సొర, బీర, కాకర, పొట్ల, అనప, బూడిద గుమ్మడితో పాటు, వంగ, బెండ, టమాటా తదితర రకాలను సాగు చేసి అధిక దిగుబడులు సాధించవచ్చు. అన్ని సీజన్లలో వివిధ వాతావరణ పరిస్థితులను తట్టుకునే దొండను ఏడాది పొడవునా సాగు చేసుకునే అవకాశం ఉంది. అనప, బీర, పొట్ల, కాకర పంటలను పందిరిపై పెంచితే మంచి నాణ్యత కలిగిన దిగుబడి వచ్చి అధిక లాభాలను పొందే అవకాశం ఉంటుంది. –బంగారుపాళెం



కూరగాయల పంటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి

- కూరగాయల సాగుకు సరైన తరుణం
- రాయితీపై విత్తనాలు సరఫరా
- పందిరి సాగు మరింత ఆశాజనకం
- నియోజకవర్గంలో 46.460 ఎకరాల్లో సాగు

పూతలపట్టు నియోజకవర్గంలోని బంగారుపాళెం, తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు, యాదమరి మండలాల్లో 46.460 ఎకరాలలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నట్లు ఉద్యానశాఖ గణాంకాలు చెబుతున్నాయి. కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ఉద్యానశాఖ మేలైన విత్తనాలను 50 శాతం రాయితీపై అందజేస్తోంది. కూరగాయల రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన రశీదుతో పాటు సాగు చేస్తున్న భూమి వివరాలతో కూడిన దరఖాస్తులను గ్రామ ఉద్యానశాఖ అసిస్టెంట్ల ద్వారా జిల్లా కార్యాలయానికి పంపితే డీహెచ్ఓ పరిశీలించి విత్తన రాయితీ సొమ్ము నేరుగా రైతుల ఖాతాల్లోకే జమ చేస్తారు. తీగజాతి కూరగాయలైన కాకర, బీర పంటలు, టమాటా పంటను పందిరి విధానంతో(కట్టెలు, దారాలతో) సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.7,500, మల్చింగ్ పద్ధతి(ప్లాస్టిక్ కవర్లు భూమిపై పరచి సాగు) ద్వారా సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.6,400 ఉద్యానశాఖ రాయితీ అందిస్తోంది. రైతులు రైతు సేవా కేంద్రాలలో పొలం పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్సు పత్రాలు, రైతు పొలంలో తీసుకున్న ఫొటో ఇవ్వడం తప్పనిసరి. కూరగాయల నారు బిల్లు, ప్లాస్టిక్ కవర్లకు సంబంధించిన బిల్లు సమర్పించాల్సి ఉంటుంది.

తెగుళ్లు, సస్యరక్షణ చర్యలు

గుమ్మడి బెండు పురుగు: ఈ తెగులు మొక్క మొలిచిన వెంటనే సోకి ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. నివారణకు రెండు శాతం పాలిడాల్ పొడిని వారంలో రెండుసార్లు చల్లాలి. వీటి ప్రభావం ఎక్కువగా ఉంటే లీటరు నీటికి ప్రొఫినోఫాస్ రెండు మి.లీ లేదా మలాథియాన్ రెండు మి.లీ చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

పొట్లాకు పురుగులు: ఇది మొక్కల పెరుగుదల, పూత దశల్లో ఆకులను ఎక్కువగా తినేస్తాయి. నివారణకు క్లోరోఫైరిఫాస్ 2 మి.లీ లేదా ఒక గ్రాము థయోడీకార్బ్‌ను లీటరు నీటికి కలిపి పూతకు ముందు పిచికారీ చేయాలి.

పండు ఈగ: పండు ఈగ సోకి పంటలో కోతకు వచ్చే కాయలను ధ్వంసం చేయడంతో పాటు కాయ లోపలి భాగం కుళ్లి నాణ్యత తగ్గుతుంది. దీనికి ఒక మి.లీ మలాథియాన్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నివారణకు 10 లీటర్ల నీటికి 100 మి.లీ మలాథియాన్, 100 గ్రాముల బెల్లం, 250 మి.లీ బాగా పులిసిన కల్లును మట్టి మూకుళ్లల్లో పోసి పొలంలో అక్కడక్కడా పెట్టాలి.

బూజు తెగులు: నివారణకు లీటరు నీటికి మాంకోజబ్ 2.5 గ్రాముల మందును కలిపి పిచికారీ చేయాలి. తెగులు తీవ్ర దశలో ఉంటే రెడోమిల్ ఎం.జడ్ ఒక గ్రాము చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

బూడిద తెగులు: నివారణకు లీటరు నీటికి ఒక మి.లీ కెరాథేన్ లేదా ఒక గ్రాము డైనోకాప్ కలిపి పిచికారీ చేయాలి.

రసం పీల్చే పురుగు: ఈ తెగులు సోకడంతో ఆకుల్లోని పత్రహరితం దెబ్బతిని ఆకుముడతలు ఏర్పడుతాయి. వీటి నివారణకు 1.5 గ్రాముల ఎసిఫేట్, ఫిప్రోనిల్ రెండు మి.లీ ఇమిడాక్లోప్రిడ్ మందును ఒక మి.లీ నీటికి వినియోగించాలి

పాము పొడ పురుగు: ఈ పురుగు కారణంగా చెట్టు బలహీన పడుతుంది. వీటికి ఒక గ్రాము అబామెక్టిన్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

బూడిద తెగులు: ఈ తెగులు సోకడంతో కాయ, ఆకులు, పసుపు పచ్చ రంగులోకి మారి పూర్తిగా దెబ్బతింటాయి. దీనికి లీటరు నీటిలో క్లోరోఫైరిపాస్ రెండు మి.లీ, వేపనూనె 5 మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

ఆకుపచ్చ తెగులు: ఈ తెగులును వేరుకుళ్లు తెగులు లేదా ఎండు తెగులు అని అంటారు. దీని ప్రభావంతో తీగలు వాడిపోయి ఆకులు ఎండి రాలిపోతాయి. నివారణకు బోర్డోమిశ్రమం ఒక శాతం లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాముల మందును లీటరు నీటితో కలిపి మొక్కల మొదళ్ల దగ్గర తడిచేటట్టు పది రోజుల వ్యవధిలో రెండు లేదా మూడుసార్లు పోయాలి. ముందు జాగ్రత్తగా దుక్కిలో ఎకరాకు 250 కిలోల వేపపిండిని వేసి బాగా కలియదున్నాలి. పంటవేసిన తరువాత ట్రైకోడెర్మా విరిడి కల్చర్‌ను పశువుల ఎరువులో కలిపి మొక్కల పాదుల దగ్గర వేయాలి.



మొగిలి వద్ద సాగు చేస్తున్న కాకర



వెలుతురుచేనులో పందిరి విధానంలో బీరసాగు

విత్తే ముందు జాగ్రత్తలు

కూరగాయల సాగుకు తొలుత విత్తన శుద్ధి తప్పనిసరి. కిలో విత్తనానికి మూడు గ్రాముల థైరమ్, 5 గ్రాముల ఇమిడాక్లోఫిడ్ మందును ఒకదాని తరువాత మరొకటి కలిపి విత్తన శుద్ధి చేస్తే కూరగాయ మొక్కలకు తెగుళ్లను తట్టుకునే శక్తి వస్తుంది. విత్తే ముందు ఎకరానికి ఆరు టన్నుల పశువుల ఎరువు, 35 కిలోల భాస్వరం, 18 కిలోల పొటాష్ మిశ్రమాన్ని విత్తన గుంటల్లో వేయాలి. విత్తిన 25–30 రోజుల్లో లేదా పిందె దశలో సుమారు 30 కిలోల నత్రజనిని రెండు సమపాళ్లుగా చేసి మొక్కలకు అందించాలి. కూరగాయల సాగు చేయాలని నిశ్చయించుకుంటే వేసవిలోనే దుక్కి దున్ని ఉంచుకుంటే మంచి ఫలితం ఉంటుంది. కలుపు మొక్కలు లేకుండా ఉద్యాన రైతులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి.

> **సాగులో జాగ్రత్తలు పాటిస్తే అధిక లాభాలు**
>
> తీగజాతి కూరగాయల సాగు చాలా తేలిక. ఖర్చు కూడా తక్కువే. ఇవి ఎగబాకడానికి వెదురు కర్రలతో పందిళ్లు వేసి వాటిపైకి ఎక్కేందుకు తాళ్లను కట్టాలి. పందిరి వేస్తే కాసిన కాయలు కిందకు వేలాడతాయి. ఇలా వేలాడిన వాటిని తెంపడం సులభం. ఇలా పండించిన కూరగాయలు నాణ్యతగా ఉండడంతోపాటు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటుంది. ప్రస్తుతం సరైన సమయం కావడంతో తీగజాతి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి.
>
> –సాగరిక, ఉద్యానశాఖ అధికారి, బంగారుపాళెం

నేడు మండల సర్వసభ్య సమావేశం

బంగారుపాళెం: మండల సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివశంకర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ అమరావతి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు హాజరు కావాలని కోరారు.


డ్యూటీ ఆపరేటర్లు జాగ్రత్తగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ మునిచంద్ర

పూతలపట్టు: విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పని చేసే డ్యూటీ ఆపరేటర్లు జాగ్రత్తగా పని చేయాలని ఆ శాఖ ఈఈ మునిచంద్ర తెలిపారు. శుక్రవారం పూతలపట్టు సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ షిఫ్ట్ ఆపరేటర్లు ప్రతి గంటకు రీడింగ్ తీయాలన్నారు. బ్రేకర్‌కు అమర్చే బ్యాటరీస్ ఎప్పటికప్పుడు తనిఖీ చేసి లాగ్ బుక్‌లో రికార్డ్ చేయాలన్నారు. మత్తు పానీయాలు సేవించి డ్యూటీ చేయకూడదని హెచ్చరించారు. అనంతరం సిబ్బంది 11 కేవీ లైన్‌లో ట్రీ కటింగ్ చేసి వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. వ్యవసాయ బిల్లుల వసూలుపై దష్టి సారించాలన్నారు. బ్రేక్ డౌన్లు అధికంగా ఉన్నాయని లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్ మన్లు లైన్లు తనిఖీ చేసి బ్రేక్ డౌన్ తగ్గించాలని ఆదేశించారు. డీసీ లిస్టుపై ప్రత్యేక దృష్టి పెట్టి కరెంటు బకాయిలు వసూలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఈ జ్ఞానేశ్వర్, ఏఈ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.











అర్ధగిరిలో వ్రతమాచరిస్తున్న భక్తులు

బంగారుపాళెం: ఓ ఇంటిలో వరలక్ష్మిదేవి,కొలువుదీరిన వరమహాలక్ష్మి,పసుపు అలంకరణలో పాంచాలి అమ్మవారు, గాజుల అలంకరణలో అంకాళపరమేశ్వరి

వరలక్ష్మీ నమోస్తుతే!





నిప్పుకుండలతో ఊరేగింపుకు సిద్ధంగా ఉన్న భక్తులు, పాంచాలి అమ్మవారి ఆలయంలో..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారాలకు ఎంతో విశిష్టత ఉండడంతో హిందూ సాంప్రదాయం ప్రకారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అందులో భాగంగా శుక్రవారం చిత్తూరు నగరంలోని పలు అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు సామూహికంగా వ్రతక్రతువులో పాల్గొన్నారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చనలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారు లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పసుపు, కుంకుమ, గాజులు, రవికలతో ప్రత్యేక పూజలు చేశారు. వ్రత క్రతువును అర్చకులు నిర్వహించారు. గుర్రప్పనాయుడువీధిలోని అంకాళ పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని గాజుల అలంకరణలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. విశేష పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కేఎంకుమార్, అర్చకులు కుమార్ పాల్గొన్నారు. సంతపేట ఇందిరా నగర్‌లోని పార్థసారథి భక్తపాండవ పాంచాలి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని, ఆడి నెల ముగింపు ఉత్సవాన్ని నిర్వాహకులు కస్తూరి, సుబ్రమణ్యం, దక్షిణమూర్తి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం చేసి పసుపు అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం నాగాలమ్మ ఆలయం నుంచి నిప్పుకుండలతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఓంశక్తి భక్తులు నోటికీ, వీపులకు శూలాలు గుచ్చుకుని ఆటలలో వేలాడుతూ ఊరేగారు.

బంగారుపాళెంలో...

బంగారుపాళెం: మండలంలో శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఇళ్లల్లో లక్ష్మీదేవిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మండలంలోని మొగిలి శివాలయం, దేవరకొండపై వెలసిన శ్రీజలకంఠేశ్వర స్వామి ఆలయం, బంగారుపాళెంలోని ముత్యాలమ్మ ఆలయం, వజ్రాలపురంలోని బోయకొండ గంగమ్మ, నలగాంపల్లెలోని శ్రీవేంకటేశ్వరస్వామి, మొగిలివారిపల్లెలోని పార్వతమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యమాలను నిర్వహించారు.

ఐరాలలో..

ఐరాల: మండల వ్యాప్తంగా శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా మహిళలు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించారు. శ్రావణ లక్ష్మికి స్వాగతం పలుకుతూ ఇళ్ల ముంగిళ్లలో అందమైన ముగ్గులు, గుమ్మాలకు పసుపు, కుంకుమ, మామిడి తోరణాలు, పూలతో అందంగా అలంకరించారు. తమ పూజా మందిరల్లో వరాలు ఇచ్చే వరలక్ష్మి అమ్మవారి చిత్రపటాలను, కలశాలను ఏర్పాటు చేసుకుని భక్తి శ్రద్ధలతో వ్రత పూజలు నిర్వహించారు. అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించారు. పండ్లు, వివిధ రకాల పిండి వంటకాలను నివేదించారు.

అర్ధగిరి క్షేత్రంలో...

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకొన్నారు. లక్ష్మీదేవి చిత్రపటానికి సుగంధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఉభయదారులతో అర్చకులు అమ్మవారికి అభిషేకం పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం అర్చకులు అమ్మవారి జీవిత చరిత్ర, పూజలు చేసిన భక్తులకు లభించే ఫలితాలను వివరించారు.

ఉత్తమ పురస్కారాలు

చిత్తూరు కలెక్టరేట్: విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరచిన వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది స్వాతంత్ర్య దిన వేడుకల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు.



మధుసూదన్, త్యాగరాజు, శ్రీనివాసమూర్తి, జోసఫ్, హేమాద్రిరాజు, కలెక్టరేట్



యుగేష్‌రెడ్డి, జీవన్‌సాగర్, జనార్ధన్, నాగరాజు, దేవా, బాబు



తిలక్, ప్రకాష్, వెంకటేష్, మౌనిక, కో–ఆపరేటివ్, రాజశేఖర్‌నాయుడు, సత్యనారాయణ, మధు, సుకృత, డీఈఓ కార్యాలయం



వెంకటేశులు, రూపేష్, జగ్జీవన్, ఐఅండ్‌పీఆర్, జాఫర్‌బాషా, మైనారిటీ కార్పొరేషన్, బాబురెడ్డి, నెహ్రూ యువకేంద్ర, చైతన్య, గుణశేఖర్, ఎస్ఎస్ఏ, మేఘనాథన్



యాకుబ్ ఎస్సీ కార్పొరేషన్, మురుగేష్ ఎస్సీ వెల్ఫేర్, రాజేశ్వరరావు ఎంవీఐ, కోటేశ్వరరావు, వినయ్ ఎస్టీ వెల్ఫేర్, చరణ్, సాజన్, రాజేంద్రబాబు, ట్రాన్స్‌కో

భక్తి శ్రద్ధలతో వ్రత పూజలు



బొమ్మసముద్రం: దుర్గాలమ్మ

గుడిపాల: వరలక్ష్మీ వ్రతం పండుగను మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో దేవాలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఇళ్లల్లో మహాలక్ష్మి ప్రతి రూపాన్ని పసుపు, కుంకుమలతో కలశ రూపంతో తీర్చిదిద్ది, ప్రత్యేక ఆభరణాలు, వస్త్రాలతో అలంకరించి, వ్రతపూజలు చేశారు. మహిళలకు పసుపు, కుంకుమ, వస్త్రాలను అందజేశారు. నరహరిపేట చెక్‌పోస్ట్ ఆవరణలోని భద్రకాళమ్మ దేవాలయం, వసంతాపురంలో నాగాలమ్మ గుడి వద్ద, బొమ్మసముద్రంలోని దుర్గాలమ్మ ఆలయంలో ప్రత్యేకంగా హోమం, అభిషేకాలు నిర్వహించి అన్నదానం చేశారు.

పాఠశాలలో గ్రంథాలయం ప్రారంభం



దామరగుంటలో పాఠశాల గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ, దాతలు

ఐరాల: మండలంలోని దామరగుంట ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు శేఖర్‌రెడ్డి, పృథ్వీరెడ్డి, తేజశ్విని, శశాంక్, చిట్టిబాబు, గిరినాయుడు, ధనుంజయరెడ్డి, సంధ్యారాణి రూ.50 వేలతో ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల గ్రంథాలయాన్ని శుక్రవారం స్థానిక సర్పంచ్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్‌నాయుడు ప్రారంభించారు. గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాలతో పాటు బీరువా అందించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగు నీరు అందించడానికి దాత పీపీసీ జ్యువెలరీ యజమాని హరి రూ.15 వేలు విలువ చేసే ఆర్ఓ వాటర్ ప్యూరిఫయర్‌ను అందజేశారు. ఎంఈఓలు మాట్లాడుతూ దాతలు చేసిన సేవలను సద్వినియోగం చేసుకుని, విద్యార్థులు పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. దాతలు మాట్లాడుతూ విద్యార్థులు, గ్రామస్తుల విజ్ఞానార్జన కోసం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం వినాయకరెడ్డి, చంద్రారెడ్డి, ఆనందయ్య, వెంకటేశు, మనోహర్‌నాయుడు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి



గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో శుక్రవారం సర్దార్ గౌతు లచ్చన్న 115వ జయంతిని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తగ్గువారిపల్లెలో గౌడ సంఘం కార్యాలయం వద్ద గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ఏపీ గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి బుసా నాగరాజ గౌడ్, గీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహేంద్రన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, రాజకీయ వేత్తగా సర్దార్ గౌతు లచ్చన్న బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను కొనియాడారు. మండల గౌడ సంఘం అధ్యక్షుడు ఎల్లప్ప మాట్లాడుతూ, గీత కార్మికుల అభ్యున్నతి, సంక్షేమానికి లచ్చన్న ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను వినియోగించుకోండి



గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో డాక్టర్ రక్షిత

తవణంపల్లె: గ్రామీణ ప్రాంత ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ ద్వారా అందిస్తున్న మెరుగైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి వినయ్ కుమార్ తెలిపారు. మండలంలోని జి.గొల్లపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 40 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం 104 మొబైల్ క్లినిక్‌లో గర్భవతులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు ఆస్పత్రుల్లో ప్రసవించడం తల్లీబిడ్డకు శ్రేయస్కరమని వివరించారు. రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య బృందం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎల్‌పురంలో

గుడిపాల: మండలంలోని ఏఎల్‌పురంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. బొమ్మసముద్రం వైద్యాధికారి రక్షిత గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు, బీపీ, మధుమేహం వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారి ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్యం ఎలా ఉందో తెలుసుకుని సలహాలు–సూచనలు ఇచ్చారు. వైద్య సిబ్బంది శ్రీలక్ష్మి, కవిత, స్వర్ణ, రీటా,కార్లినమ్మ పాల్గొన్నారు.